క్లుప్తంగా

30న రాష్ట్ర స్థాయి ప్రతిభా పోటీలు

రాయవరం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 30న మండలంలోని లొల్ల విశ్వమానవత ఆశ్రమంలో రాష్ట్రస్థాయి ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్టు విశ్వమానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాస చౌదరి తెలిపారు. మానవత ఆశ్రమంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లొల్ల ఆశ్రమంలో 30వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. వేమన పద్యాలు, భగవద్గీత శ్లోకాలు, వక్తృత్వ పోటీలు, పాటలు, కవితలు, అన్నమాచార్య కీర్తనలు, వ్యాసరచన, యోగా తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 99666 73111 నంబరుకు ఫోన్ చేసి తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కావడి మహోత్సవం


సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకించే పవిత్ర నదీజలాలతో మహిళలు

మండపేట: మండలంలోని ద్వారపూడిలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి కావడి మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. గత 50 ఏళ్లుగా నిర్విరామంగా కావడి, తీర్థపు బిందె అందుకుంటున్న స్వామివారి ఉత్సవాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరిపారు. స్వామివారి మండల దీక్ష చేపట్టిన 200 మంది స్వాములు దీక్షా విరమణ సందర్భంగా కావడి నృత్యం చేశారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ జరిగిన ఉత్సవంలో గ్రామంలోని యువతులు, మహిళలు తీర్థపు బిందెలను మోస్తూ స్వాముల వెంట నడిచారు. అనంతరం ఆలయానికి చేరుకుని పవిత్ర నదీజలాలతో స్వామివారికి అభిషేకం చేశారు. సంతాన భాగ్యం కోరుతూ పలువురు మహిళలు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేసవి తీవ్రతపై జాగ్రత్తలు తీసుకోవాలి

కాజులూరు: వేసవి తీవ్రత నేపథ్యంలో గర్భిణులు, వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని గొల్లపాలెం అలయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తాడి భువనేశ్వరిదేవి అన్నారు. బుధవారం గ్రామంలో క్లబ్ సభ్యులు వేసవిలో తీసుకోవలసిన ఆరోగ్య నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించి స్థానికులకు పలు సూచనలు చేశారు. విధిగా కాటన్ దుస్తులనే ధరించాలని, ఆహారంగా ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగిలినప్పుడు గుర్తించే లక్షణాలు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు వి.గణపతి, కె.గణేశ్‌కుమార్, నల్లమిల్లి భువనేశ్వరి, విజయలక్ష్మి, దుర్గారాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ


విద్యార్థులకు మజ్జిగ అందిస్తున్న హెచ్‌ఎం పుల్లయ్య


కె.గంగవరం: మండలంలోని పాణింగపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ప్రతి రోజూ విద్యార్థులకు మజ్జిగ పంపిణీ జరుగుతుంది. వేసవి కావడంతో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పాఠశాల హెచ్‌ఎం ఎం.పుల్లయ్య గ్రామ పెద్దల సహకారం కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి రోజు రెండు లీటర్ల పెరుగు ఉంటే చల్లని మజ్జిగ విద్యార్థులకు అందిస్తామని విజ్ఞప్తి చేయడంతో గ్రామ పెద్దలు ముందుకు వచ్చారు. గ్రామానికి చెందిన బలుసు నాగేంద్ర, పెందుర్తి కుమార్, కొరిపెల్ల రవితేజ, కొత్తపల్లి మురార్జీ, సర్పంచ్ సునీత తదితరులు ముందుకు వచ్చి మజ్జిగ అందిస్తున్నారని వారికి హెచ్‌ఎం పుల్లయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వేసవి సెలవుల వరకు విద్యార్థులు ప్రతి రోజు మజ్జిగ అందిస్తామని హెచ్‌ఎం చెప్పారు.

రేపు కవితల పోటీలు

మండపేట: ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా మండపేట పట్టణంలో ఈ నెల 21న కవితల పోటీలు నిర్వహించనున్నట్టు సంగమం సాంస్కృతిక వేదిక వ్యవస్థాపకుడు, ప్రముఖ హోమియో వైద్యుడు డాక్టర్ చల్లా రవికుమార్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) మండపేట శాఖ, సంగమం వేదిక సంయుక్త ఆధ్వర్యంలో గుమ్మిలేరు రోడ్డులోని అన్నపూర్ణ హైస్కూల్లో సాయంత్ర 5 గంటలకు కవితల పోటీలు, కవి సమ్మేళనం నిర్వహించునున్నామని తెలిపారు. అరసం జిల్లా అధ్యక్షుడు గండి స్వామిప్రసాద్ మాట్లాడుతూ ఏ అంశంపై రాసినా కవితలు హృదయానికి హత్తుకునేలా ఉండాలన్నారు. 25 లైన్లకు మించరాదని చెప్పారు. కవితలు రాసే యువతను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 99492 84754 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- మొదలైన వేసవి కాలం
- చంటి పిల్లలతో జాగ్రత్త


చికెన్ ఫాక్స్ నమూనా ఫొటో

రామచంద్రపురం రూరల్: వేసవి కాలం ప్రారంభమైతే చాలు చికెన్ ఫాక్స్(ఆటలమ్మ), గవద బిళ్లలు వంటి సమస్య పిల్లల్లో అధికంగా కనిపిస్తాయి. ప్రస్తుతం పలు గ్రామాల్లో ఈ సమస్యలతో చిన్నపిల్లలు బాధపడుతున్నారు. చాలా మంది తమ పిల్లల్ని ఆస్పత్రులకు తీసుకువస్తుంటే.. కొంతమంది పూర్వకాలం పద్ధతుల్లో నాటు వైద్యం చేయిస్తున్నారు. అన్ని వయసుల వారికి ఈ వ్యాధులు సోకే అవకాశం ఉన్నా చిన్నారులకు త్వరగా సోకుతుందని వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధుల బారిన పడిన వారికి జలుబు, జ్వరం, శరీరంపై పొక్కులు, దవడలకు ఇరువైపులా బిళ్లలు, నొప్పి వంటి సమస్యలు తీవ్రంగా బాధిస్తాయి. ముందు జాగ్రత్తతోనే ఈ ప్రమాదకర అంటువ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, 15 ఏళ్లలోపు బాలబాలికలపై మరింత శ్రద్ధ వహించాలంటున్నారు.

జాగ్రత్త వహించాలి

రామచంద్రపురం నియోజకవర్గంలోని ఐదేళ్లలోపు చిన్నారులు కాజులూరు మండలంలో 3887 మంది, కె.గంగవరం మండలంలో 4922 మంది, రామచంద్రపురం మండలంలో 3890 మంది మొత్తం 12,699 మంది చిన్నారులు ఉన్నారు. ఈ వేసవిలో వారిపట్ల మరింత శ్రద్ధ చూపాలని వైద్యులు సూచిస్తున్నారు. సాధారణంగా వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో ఈ సమస్యలు ఎక్కువగా వస్తాయని అంటున్నారు. ఈ వ్యాధులు ప్రాణాంతకం కాకపోయినా వ్యాధి సోకిన వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతారు. ఆకలి లేకపోవడంతో ఆహారం సరిగ్గా తీసుకోలేక బాగా నీరసించిపోతారు. చర్మంపై నీటి పొక్కులు, దురదలు వంటి లక్షణాలు వారం నుంచి పదిహేను రోజులకు పైగా బాధిస్తాయి. తొలుత జలుబుతో ప్రారంభమయ్యే ఈ వ్యాధులు క్రమంగా వాటి ప్రభావం చూపుతాయి. శరీరంపై నీటి పొక్కులు, జ్వరం వంటి లక్షణాలు కనిపించగానే ఆటలమ్మగా గుర్తించి తక్షణం వైద్యులను సంప్రదించాలి. నాటు వైద్యం వైపు వెళ్లరాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి యాంటీ వైరల్, యాంటీ బయాటిక్ మందులు వాడాల్సి ఉంటుంది. తద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించడమే కాకుండా, వేగంగా నయం కావడానికి అవకాశం ఉంటుంది.

ఆటలమ్మ... జాగ్రత్తలు

సాధారణంగా ఈ వ్యాధి వారం నుంచి పది రోజుల వరకు ఉంటుంది. ఆటలమ్మ అంటువ్యాధి కావడం వల్ల వ్యాధి సోకిన వారిని మిగిలిన వారికి దూరంగా ఉంచాలి. వ్యాధి సోకిన పిల్లలను పాఠశాలకు పంపకూడదు. ప్రతి రోజూ స్నానం చేయవచ్చు. జ్వరం ఉంటే వేడి నీటితో శరీరాన్ని శుభ్రం చేయాలి. దురద రాకుండా పరిశుభ్రత పాటించాలి. చిన్నారులకు చేతి గోళ్లు తీసివేయడం మంచిది. మంచి పౌష్టికాహారం అందించాలి. ఆటలమ్మ వచ్చిన వారు కోరినవన్నీ ఇవ్వాలన్న అపోహతో అన్ని రకాల తినుబండారాలను ఇవ్వడం మంచిది కాదు. తేలికగా జీర్ణమయ్యే మంచి పౌష్టికాహారాన్ని అందించాలి.

గవదబిళ్లలు... జాగ్రత్తలు

గవదబిళ్లల వ్యాధిలో తీవ్రంగా గొంతునొప్పి ఉంటుంది. నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. తరచూ ద్రవ పదార్థాలను ఆహారంగా తీసుకోవాలి. నీరసం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. శరీరంలో ద్రవాల శాతం తగ్గుతుంది. కాబట్టి ఓఆర్ఎస్ వంటివి తీసుకోవడం మంచిది.


గవద బిళ్లల నమూనా ఫొటో

నాటువైద్యం ప్రమాదకరం:

చికెన్‌పాక్స్, గవద బిళ్లలు వచ్చిన వారి విషయంలో ప్రజలు అపోహలు, మూఢనమ్మకాలు పెట్టుకోకుండా వైద్యులను సంప్రదించాలి. చాలామంది మూఢనమ్మకాలతో వైద్య సహాయం తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. వైద్యుని సలహా తీసుకుని అవసరమైన మందులకు క్రమం తప్పకుండా వాడాలి. వ్యాధి ఎక్కువగా ఉంటే మెదడు, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. గర్భిణులపై ఈ సమస్య తీవ్ర ప్రభావం చూపుతుంది. నాటువైద్యాన్ని ఆశ్రయిస్తే ప్రమాదానికి దారి తీస్తుంది.

వైద్యులను సంప్రదించాలి



ఆటలమ్మ, గవద బిళ్లలు వంటి వ్యాధులను నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు. ప్రస్తుతం చిన్న పిల్లలు ఎక్కువగా ఈ సమస్యలతో బాధపడుతున్నారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే అందుబాటులో వైద్యులను సంప్రదించాలి. వారి సూచనల మేరకు మందులు వాడాలి.

– ఎస్.ప్రశాంతి, డివిజనల్ వైద్యాధికారి, రామచంద్రపురం

ఉత్తమ సేవల్లో అంగర పీహెచ్‌సీకి జిల్లాలో మొదటి స్థానం

కపిలేశ్వరపురం: ఉత్తమ వైద్య, ఆరోగ్య సేవలు అందించడంలో అంగర పీహెచ్‌సీ జిల్లా స్థాయిలో మొదటి స్థానాన్ని దక్కించుకుంది. ఫిబ్రవరి నెలలో అందించిన సేవలకు ఈ గుర్తింపు దక్కినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పీఎస్ఎస్‌డీ రత్నకుమారి బుధవారం తెలిపారు. ఆ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులందినట్టు ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని వైద్యారోగ్య శాఖ పరిధిలో ఏడు అర్బన్ సీహెచ్‌సీలు, 46 గ్రామీణ పీహెచ్‌సీలు ఉన్నాయన్నారు. వైద్యులు, సిబ్బంది సమష్టి కృషి ఫలితంగా తమకు మొదటి స్థానం దక్కిందన్నారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, గ్రామాల ప్రజల పూర్తి సహాయ సహకారాలు వల్లే ఈ ప్రగతిని సాధించినట్టు భావిస్తున్నామని చెప్పారు.

వ్యోమగామి సునీత విలియమ్స్‌కు స్వాగతం


వ్యోమగామి సునీత విలియమ్స్‌కు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కె.గంగవరం: మండలంలోని కె.గంగవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు అంతరిక్ష వ్యోమగామి సునీత విలియమ్స్‌కు స్వాగతం పలికారు. హెచ్‌ఎం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు పీవీ బ్రహ్మానందం మాట్లాడుతూ 9 నెలలు అంతరిక్షంలో ఉండి సురక్షితంగా భూమి మీదకు తిరిగి వచ్చిన సునీత విలియమ్స్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్క విద్యార్థి అంతరిక్షంపై అవగాహన ఏర్పరచుకోవాలని ప్రస్తుతం తొమ్మిదో తరగతి విద్యార్థులకు యువిక పేరుతో ఇస్రో ఒక పరీక్ష నిర్వహిస్తుందని దానికి విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీని ద్వారా అంతరిక్షం గురించి వివరాలు తెలియడంతో పాటు ప్రత్యేక శిక్షణ ఇస్తారని తద్వారా భౌతిక శాస్త్రంలో విజ్ఞాన శాస్త్రవేత్తలుగా ఎదగడానికి వీలవుతుందని చెప్పారు. ఉపాధ్యాయులు శ్రీధర్, రామలక్ష్మి, పి.శ్రీనివాస్, ఏడుకొండలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కపిలేశ్వరపురం: బీసీ కార్పొరేషన్ ద్వారా రుణ సదుపాయం పొందేందుకు బీసీ సామాజిక వర్గాలు, ఈబీసీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీఓ కె.రత్నకుమారి బుధవారం తెలిపారు. బీసీ ఏ,బీ,సీ,డీ,ఈ సామాజిక వర్గాలకు చెందినవారు, ఆర్యవైశ్య, రెడ్డి, క్షత్రియ, కమ్మ, బ్రాహ్మణ తదితర ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారు ఈ నెల 22వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాల్లో స్వయం ఉపాధి పొందేందుకు అర్హులకు సబ్సిడీతో కూడిన రుణ సదుపాయం కల్పిస్తారన్నారు. డి.ఫార్మసీ, బి.ఫార్మసీ విద్యార్హతగల నిరుద్యోగులు జనరిక్ ఫార్మసిని నెలకొల్పుకోవచ్చన్నారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చెందిన వారు మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ పథకం ద్వారా స్వయం ఉపాధికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆయా విభాగాల్లో ఆసక్తిగలవారు httpr://apobmmr.apcfrr.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. తెల్లరేషన్‌కార్డు, ఆధార్ కార్డు, పాస్ పోర్టు సైజ్ ఫొటో, మొబైల్ నంబరు తదితర వివరాలతో ఈ సేవా కేంద్రం, సచివాలయాలను సంప్రదించవచ్చని ఎంపీడీఓ రత్నకుమారి తెలిపారు.

కోడలు, మనవడు కనిపించడం లేదని ఫిర్యాదు

రామచంద్రపురం రూరల్: తన 24 ఏళ్ల కోడలు, 4 ఏళ్ల మనవడు కనిపించడం లేదని కె.గంగవరం మండలం దంగేరు శివారు కూనిమిల్లిపాడుకు చెందిన నీల రామకృష్ణ బుధవారం ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. నీల రామకృష్ణ పెద్ద కుమారుడు స్వామి ప్రసాద్ భార్య శాంతికుమారి తోటపేటలోని ఒక ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా విధులు నిర్వహిస్తోంది. తనతో పాటు తన 4 ఏళ్ల కుమారుడు కుశ్వంత్ ఈశ్వర్‌ను కూడా అదే పాఠశాలకు తీసుకువెళుతుంది. 18వ తేదీ మంగళవారం ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్లిన శాంతికుమారి, కుమారుడు కుశ్వంత్ ఈశ్వర్‌లు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫోన్ స్విచాఫ్ వస్తున్నట్లు పిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై ద్రాక్షారామ అడిషనల్ ఎస్సై భుజంగరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధే లక్ష్యంగా విధులు నిర్వహించాలి


స్వామిత్వ సర్వేను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి శాంతిలక్ష్మి

కె.గంగవరం: ప్రతి ఒక్కరూ పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా విధులు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతిలక్ష్మి అన్నారు. మండలంలోని కూళ్ల పంచాయతీలో బుధవారం ఆమె పర్యటించారు. తొలుత పంచాయతీ కార్యాలయ రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను స్వయంగా పరిశీలించి సర్వే సిబ్బంది పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి శానిటేషన్ సిబ్బందికి సూచనలిచ్చారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి చెందితే గ్రామం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. తడి, పొడి చెత్త సేకరణలో బాధ్యతగా విధులు నిర్వహించి సంపద సృష్టించాలన్నారు. గ్రామంలో పారిశుధ్యం ఎప్పటికప్పుడు మెరుగుపడేలా చూడాలన్నారు. గ్రామాభివృద్ధిలో పంచాయతీ సిబ్బందితో పాటు పాలకవర్గ సభ్యులు కూడా భాగస్వాములు కావాలని ఆమె సూచించారు. సర్పంచ్ చిల్లి నాగేశ్వరరావు, ఈఓపీఆర్డీ కేఎస్ గౌరికుమారి, పంచాయతీ కార్యదర్శులు ఎం.సత్యనారాయణమూర్తి(చంటి), కేవీవీ సత్యనారాయణ, వి.గౌరీశంకర్, పంచాయతీ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గొప్పిరేవు వంతెన రెయిలింగ్‌ని పునర్నిర్మించాలి


గొప్పిరేవు వంతెనపై ప్రమాదకరంగా మారిన రెయిలింగ్

కాజులూరు: యానం, ద్వారపూడి రహదారిలో మండలంలోని ఉప్పుమిల్లి శివారు గొప్పిరేవు వంతెనపై ప్రమాదస్థితిలో ఉన్న రెయిలింగ్‌ను అధికారులు పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. నెల రోజుల క్రితం యానం నుంచి ద్రాక్షారామ వైపునకు వెళుతున్న లారీ ఒకటి అదుపు తప్పి గొప్పిరేవు వంతెనపై రెయిలింగ్‌ను ఢీకొట్టి టేకి డ్రెయిన్‌లోకి దూసుకుపోయింది. ప్రమాద సమయంలో డ్రెయిన్‌లో పూర్తి స్థాయిలో నీరు లేకపోవటంతో త్రుటిలో ప్రాణపాయం తప్పి లారీ డ్రైవర్, క్లీనర్ గాయాలతో బయటపడ్డారు. అనంతరం జేసీబీల సహాయంతో లారీని బయటకు తీశారు. అయితే లారీ ఢీకొని విరిగిపోయిన రెయిలింగ్‌ను అలానే వదిలివేయటంతో అది ప్రమాదకరంగా మారింది. అసలే వంతెన ఇరుకిరుకుగా ఉండటంతో రాత్రి సమయాల్లో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఒకదానిని ఒకటి తప్పించుకువెళ్లబోయి రెయిలింగ్ లేని కారణంగా అదుపు తప్పి డ్రెయిన్‌లోకి పడిపాయే అవకాశం ఉంది. రహదారిలో నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయని గత నెలలో ప్రమాదానికి గురైన లారీ మాదిరి మరో వాహనానికి ప్రమాదం జరగకుండా అధికారులు త్వరితగతిన రెయిలింగ్ పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

కుట్రపూరితంగా ఎస్సీ వర్గీకరణ


మండపేటలో నిరసన తెలుపుతున్న రెల్లి కులస్తులు

కపిలేశ్వరపురం: ఎస్సీ వర్గీకరణపై కూటమి ప్రభుత్వం అత్యుత్సాహం చూపడం పూర్తి కుట్రపూరితమని మాలమహానాడు నాయకుడు పాలింగి కృష్ణ కిశోర్ అన్నారు. మంత్రుల కమిటీ సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించడాన్ని ఆయన ఖండించారు. రాజ్యాంగ పరిధిలో చట్ట సభల్లో చర్చ జరపకుండా తెలుగు రాష్ట్రాల్లో వర్గీకరణ ప్రక్రియపై పాలకులు ముందుకు వెళ్లడాన్ని తప్పుబట్టారు. 2025లో చేసే వర్గీకరణకు 2011 జనాభాను ప్రాతిపదికగా తీసుకోవడం సీఎం చంద్రబాబు రాజకీయ పరాధీనతకు నిదర్శనమన్నారు. ప్రస్తుతం కులగణన చేపట్టాల్సిన బాధ్యతను విస్మరిస్తూ దళిత కులాలను విడదీయడం ద్వారా చంద్రబాబు రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే వర్గీకరణ ప్రక్రియను నిలుపుదల చేయకపోతే మాలలు అందరూ కలసి ఐక్యంగా ఉద్యమిస్తామని కిశోర్ హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్తులకు అన్యాయం

మండపేట: ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులానికి తీరని అన్యాయం జరిగిందని రాష్ట్ర రెల్లి కులాల సంక్షేమ సంఘం ప్రచార కార్యదర్శి బొచ్చా నరసింహమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ముత్యాల సుబ్రహ్మణ్యం అన్నారు. రిజర్వేషన్ విషయంలో తమకు అన్యాయం చేశారంటూ బుధవారం పట్టణంలో రెల్లి కులస్తులు ఆందోళన నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణలో 1 శాతం రిజర్వేషన్ ఇవ్వడం తగదంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి, సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం తాము విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో ఏనాడు లబ్ధి పొందలేదన్నారు. దళితుల్లో అట్టడుగున ఉన్న తమకు ఒక శాతం రిజర్వేషన్ ఇవ్వడం బాధాకరమన్నారు. జనాభా పరంగా రాష్ట్రంలో తాము 15 నుంచి 20 లక్షలు ఉన్నామన్నారు. 1999 నుంచి 2004 వరకూ తమకు ఒక శాతం రిజర్వేషన్ అమల్లోనే ఉందన్నారు. తమకు రిజర్వేషన్ 3 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెల్లి సంఘం పట్టణ అధ్యక్షుడు బంగారు రాజు, బొచ్చా శివకుమార్, యర్రంశెట్టి రాజు, ఇంటి అప్పారావు, గొర్రిపర్తి సతీష్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు


పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న ఇన్‌ఫ్రా జాయింట్ డైరెక్టర్ రామలింగం

రామచంద్రపురం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు పరీక్షల ప్రత్యేక అధికారి ఇన్ఫ్రా జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం తెలిపారు. రామచంద్రపురం పట్టణంలోని ఆరు పరీక్ష కేంద్రాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరును నిశితంగా పరిశీలించారు. పది పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయన్న అంశాన్ని పరిశీలించారు ముఖ్యంగా పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఇంటిలిజం ఫ్యాన్లు తదితర మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయన్న విషయాన్ని పరిశీలించారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాల్సిందిగా రామచంద్రపురం డీవైఈఓ మండల విద్యాశాఖాధికారులు నల్లమిల్లి వీర్రాజు, వాసన్‌శెట్టి నాగేశ్వరి సూచించారు. ఆయన వెంట సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు రామచంద్రపురం డీవైఈఓ పి.రామలక్ష్మణమూర్తి, మండల విద్యాశాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సోషల్ ఆడిట్ గ్రామసభలు


చోడవరం గ్రామ సభలో నివేదిక చదివి వినిపిస్తున్న సోషల్ ఆడిట్ సిబ్బంది

రామచంద్రపురం రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2023–24లో రామచంద్రపురం మండలంలోని 25 పంచాయతీల్లో చేపట్టిన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ గ్రామ సభలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు చోడవరం, బాపనయ్యచెరువు, వెల్ల గ్రామాల్లో నిర్వహించారు. శ్మశానంలో మొక్కలు నాటించాలని, గతంలో వేసిన మొక్కలు చనిపోయాయని మళ్లీ వేయాలని, నూతన జాబ్ కార్డులు ఇవ్వాలన్న వినతులు ఈ గ్రామ సభల్లో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

కార్యక్రమంలో ఏపీఓ మోర్త ఈశ్వరరావు, పరిశీలకుడిగా ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, సోషల్ ఆడిట్ డిస్ట్రిక్ట్ రిసోర్స్‌పర్సన్ గోపి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు నేదునూరి సంతోషమ్మ, వీరబోయిన సూరిబాబు, పిల్లి సూర్యప్రకాశరావు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

‘ఆదరణ’తో కులవృత్తులకు చేయూత


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రంగారావు

మండపేట: కులవృత్తులకు చేయూతనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదరణ పథకం–3 అమలు చేస్తోందని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. పట్టణంలోని కులవృత్తి దారులతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రంగారావు మాట్లాడుతూ ఆధునిక పనిముట్ల నాణ్యత, కంపెనీ, ఏజెన్సీ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కులవృత్తికి అవసరమయ్యే పనిముట్ల వివరాలు కూడా ఉండాలన్నారు. పూర్తి వివరాలతో నివేదికను బీసీ కార్పొరేషన్‌కు పంపుతామని ఆయన తెలిపారు. సమావేశంలో కులవృత్తి దారులు, ఆయా సంఘాల నాయకులు, మెప్మా సీఎంఎం పెండ్యాల సుజాత, సిబ్బంది గుబ్బల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

రాయవరం: మండలంలోని పసలపూడి శివారు యర్రమట్టిపురంలో పేకాట శిబిరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో దాడి చేసి పేకాడుతున్న పిల్లి రాంబాబు (యర్రమట్టిపురం), గెద్దాడ దుర్గాప్రసాద్(రామచంద్రపురం), కాకి విజయకుమార్ (యర్రమట్టిపురం), తాడి రాజ్‌కుమార్(బత్తులవారిసావరం), పితాని శివ(సూరయ్యమ్మపేట)లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.6,900 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

రావులపాలెం: ఇసుక తవ్వకాల్లో కాంట్రాక్టర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ అన్నారు. మండలంలోని పొడగట్లపల్లి, ఊబలంక ఇసుక ర్యాంపులను ఆర్డీవో శ్రీకర్ బుధవారం టాస్క్ ఫోర్స్ బృందంతో కలిసి సందర్శించారు. ర్యాంపుల్లో తవ్వకాలు, ఇసుక స్టాక్ పాయింట్ వద్ద పరిశీలన చేసి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మైనింగ్ శాఖ అధికారులు సూచించిన పరిధిలోని తవ్వకాలు చేయాలన్నారు. ఉచిత ఇసుక పథకంలో అక్రమాలు జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముక్తేశ్వరరావు, ఎంపీడీవో మహేష్, ఆర్ఐ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

రామచంద్రపురం: పంట పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడంతో విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. పట్టణంలోని బైపాస్ రోడ్డులో కొత్తూరు సెంటర్ నుంచి పసలపూడి వైపు బైపాస్ రోడ్డును అనుకుని వేసిన విద్యుత్ స్తంభాలు వరి చేలల్లో ఒరిగిపోయాయి. రోడ్డుకు ఇరు వైపులా వేసిన చెట్ల మూలంగా విద్యుత్ స్తంభాలు పంట పొలాల వైపునకు వాలిపోయి. తీగలు చేలలో వేలాడుతున్నాయి. ప్రస్తుతం పొట్ట దశలో ఉన్న పంట పొలాలు కోతలు దశకు చేరుకున్న వేళ రైతులకు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ స్తంభాలను నిలబెట్టి తీగలను సరిచేయాలని, రైతులు కోరుతున్నారు. దీనిపై ఏపీఈపీడీసీఎల్ ఈఈ రత్నాలరావును వివరణ కోరగా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


పంట పొలాల్లో స్తంభాలు ఒరిగిపోవడంతో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు